# తెలివి చెట్టు

"ఎత్తుగడని బట్టి విషాదాంతమవుతుందనుకున్న కథ – ఒక్కొక్కప్పుడు అడ్డం తిరుగుతుంది. అందుకని ఎక్కడ మొదలెట్టుకుందాం?" అడిగారు తాతగారు.

శ్రోతలు నలుగురూ ఎవ్వరూ ఏ సమాధానమూ చెప్పలేదు.

"సరే చివరికి చూద్దాం – కథ ఎటు లాక్కెళుతుందో మనల్ని. వినండి."

నలుగురూ సన్నగా నవ్వేరు. "చెప్పు....చెప్పు" అన్నారు.

కథ మొదలైంది.

❖ ❖ ❖

నాన్న... నాన్న.. అంటూ నాన్న గురించి నలభై కవితలూ, తొంభై కథలూ రాసి, 'అబ్బ. నాన్న ఎంత మంచివాడు... మా నాన్న ఎంత గొప్పవాడు' అని కళ్ళు చెమరింపజేస్తున్నారు – ఈనాటి కవులూ, కథకులూ కూడా. కానీ, రాముడి ముందు 'నాన్న' పదం వినపడితే రెచ్చిపోయేవాడు!

రాముడికి నాన్నంటే పులి. నాన్నంటే టెర్రర్. నాన్నంటే గండుపిల్లి. నాన్నంటే చింత బరికె. నాన్నంటే రూళ్ళకర్ర. స్కేలు బెత్తం. అందుకనే నాన్నంటే వాడికి అసహ్యపు ముద్ద.

నాన్నంటే నాన్నమ్మ తిట్లలో రాక్షసముండాకొడుకు. అమ్మ ఏడుపులో – వీడి జిమ్మడా, వీడికెప్పుడూ నా కొప్పే దొరుకుతుంది. ఈడ్చుకు పోతుంటే ప్రాణం కళ్ళల్లో కొస్తుంది. సచ్చినోడు. వీడి చేతులు పడిపోనూ...' అందుకనే రాముడికి నాన్నంటే దురదగుండాకు. నాన్నంటే తుమ్మకంప.

ఆ వేళం జరిగిందో చూడండి.

❖ ❖ ❖

తెనాలిలో శ్రీరామనవమి, పండుగంటే పండగా అది!

'చూచువారలకు చూడ భాగ్యమట' అన్నట్టే.

ఆకాశమంత తాటాకు పందిళ్ళు. లైట్లు. కటౌట్లు. ఫైట్లు, వింతలు. వినోదాలు... అంగళ్ళు.. మిఠాయిలు... గోలీసోడాలు.. కలర్ డ్రింక్‌లు... ఐస్‌ఫ్రూట్‌లు.. రికార్డ్‌లు... రికార్డ్ డ్యాన్స్‌లు....

నందనవనంలా వెలిగిపోతున్నాయ్ రహదారులన్నీ.

తలంటిపోసుకుని, కొత్త దుస్తులు కట్టుకుని, కురులు తడిఆర్చుకుంటున్న పడుచుపిల్లలా వయ్యారాలు పోతున్నె రోడ్లన్నీ. అందునా మెయిన్‌రోడ్ సంగతి చెప్పేదేముంది? పూతపట్టిన రసాలంలా వుంది!

మేళాలూ, బాజాలూ, గ్రామఫోన్‌లలో సినిమాపాటలూ,.... 'పెద్దమనుషులు' రిలీజైన కొత్తరోజులు. ఎక్కడవిన్నా – శివశివమూర్తివి గణనాథ!' ఏ పందిరి గుంజని పట్టుకున్నా– 'నందామయా గురుడ, నందామయా'నే పాడుతోంది.

ఇటు తాజ్‌మహల్‌బీడీ కోట. అటు బావుటా బీడీకోట! పోటాపోటీగా అలంకరణలూ, లైట్లూ, ప్రోగ్రామ్‌లూ.

'అ... ఆలు రానట్టి అన్నయ్యలందరికి అధికారయోగమ్ము పట్టేనయా... కుక్కతోకా పట్టి గోదావరీదితే కోటిపల్లీకాడ తేలేరయా!' రికార్డ్ అదిరిపోతోంది కానీ జనం నోట ఆ పాట కరిగిపోతోంది.

షాపుషాపుకీ ముస్తాబు. గుడిగుడిలో కళ్యాణం. ప్రతి కూడలిలో పచ్చతోరణాలు. పందిళ్ళన్నీ రంగు కాగితాల తోరణాలు, బుట్టలు, డిజైన్ కట్టింగులూ.. అలంకరణలూ...

ప్రసాదాలకి కొదవేముంది? బొక్కిందే దక్కుదల అన్నట్టు వడపప్పు. తాగిందే కమ్మదనం అన్నట్టు పానకం. నడుమనడుమ తాగునీరు డ్రమ్ములూ, చలివేంద్రాలూ!!

సామెతకే కాళ్ళొచ్చినట్లు 'ఇసకవేస్తే రాలని జనం?'

ఒకటే తోపిడీ, నెట్టుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ పడుతూ లేస్తూ అడుగుని సాధించుకోవటమే. మూడడుగులు ముందుకూ, ఆరడుగులు వెనక్కూ...!

"అంత రద్దీగా వుంటుందా?" ఎవరో అడిగారు.

బుంగమీసం దువ్వుకుంటూ "కుర్రకుంకలు – మీ ఊహకే అందదురా. చూస్తేనే అర్థమయ్యేది. ఆ జనం మధ్యలో నడవటమే ఒక జీవితానుభవం రా...'

సరే కదలండి. అడుగో రాముడు. అప్పలస్వామి గుడినుంచీ అతి కష్టం మీద పెద్దవంతెన దాకా – జనప్రవాహంలో కొట్టుకొచ్చాడు.

అక్కడ నాన్న కనిపించాడు. వీణ్ణి పట్టుకున్నాడు.

'వెధవ తిరుగుడు చాలుగానీ, ఇటు చావ్.." అంటూ చేయిపట్టుకుని లాక్కెళ్ళాడు. మెయిన్‌రోడ్‌కీ ఆ పక్కన గెయిటీ థియేటర్‌కీ మధ్యన నిలబెట్టాడు. పక్కగా చెరుకుగడల బండి. రోడ్డువారగా చెరుకుగడల మోపు దించేసి ఉంది.

కొంచెం గాలి తగిలింది. ఊపిరాడినట్లయింది. చొక్కా సర్దుకుని 'హమ్మయ్య' అనుకున్నాడు.

నాన్న!

చిరాకు మొహంతో రాముడికేసి చూశాడు. వాడి చేతికో విసనకర్రల బొత్తి యిచ్చాడు. అన్నీ తాటాకు విసనకర్రలు.

'ఇదిగో ఇరవై యిసనకర్రలు. ఒక్కొక్కటీ అర్ధణా.జ ఇరవైపోతే మన కొచ్చేది పావలా. జాగ్రత్త. గుంపులోకి పోమాక ఇక్కడే నిలడు. పక్కల్న జూసుకుంటావుండు. అంతా దొంగ నాయాళ్ళు. చేతిలోనే గుంజుకుపోగల్రు" అని హెచ్చరించి. ఒకటికి నాలుగుసార్లు జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు.

రాముడు అతి శ్రద్ధగా 'పని'లో పడ్డాడు!

'ఇసనకర్రర్ధణా.... ఇసనకర్రర్ధణా' అంటూ గొంతు చించుకుంటున్నాడు రాముడు. బేరం కదల్లేదు.

అరగంటయింది.

ఒకపెద్ద గుంపొచ్చింది.

బేరమాడారు. 'ఇరవయ్యీ కావాల చెప్పు' అన్నారు. 'ఇచ్చే బేరం చెప్పు' అన్నారు. 'పావలాకిచ్చేయ్' అన్నారు.

రాముడికి తిక్కరేగింది. 'పొండెహె. తేరగా దొబ్బుదామని...' అని కసురుకున్నాడు.

వచ్చిన గుంపులో ఎవరో రాముడి మీది కొచ్చాడు 'ఏంటిరా అన్నది;? మళ్లీ అను' అంటూ రెట్టించాడు. అతనికి వత్తాసుగా వాళ్ళంతా మాట్లాడుతూ

మీదిమీదికొచ్చారు. వో పాతికేళ్ళ కుర్రాడు మొత్తం విసనకర్రల కట్టనే లాక్కుని రాముణ్ణి ఒక్క తోపుతోసి, రక్కున పరిగెత్తుకు పోయాడు. మిగిలిన వాళ్ళూ అటూ ఇటూ పారిపోయారు. రాముడు వాళ్ళని వెంబడించాడు. దొరకలేదు. రాముడికి గుండె గుభిల్లుమంది. ఏడుపు ఎగదన్నింది. నాన్న భయం గుండెల్లో రాయిని పడేసింది. ఆ గుంపు మాట్లాడిన మాటలు తలపుకొచ్చిన్నై. దుఃఖం, కోపం, ఆవేశం, రోషం... గుప్పిటి బిగిసింది. పెదవులు అదిరినై. ఏడ్చేశాడు.

ఎటుచూసినా గోల, అరుపులు, పాటలు, భజనలు, అల్లరీ, ఆగం! ఎవడి ఏడుపు ఎవరికి పట్టింది కనుక?!

రాముడికి కాళ్ళు లాగేసినై. నిస్సత్తువ ఆవహించింది. చెఱకుగడల బండి పక్కగా కూర్చుండిపోయాడు.

నాన్న రానే వచ్చాడు.

చూశాడు. ఖాళీ చేతుల్తో రాముడు. నాన్న కళ్ళు మిలమిల్లాడాయి. 'ఇరవై విసనకర్రలూ అమ్మేశాడు కొడుకు.' కొడుకు ఆకారంలో భావి బిజినెస్ మేగ్నెట్‌ని చూశాడు నాన్న. ఆత్రుతగా, ఆనందంగా రాముడి దగ్గరకొచ్చాడు. 'అన్నీ పోయినైరా? భేష్, ఏవీ పైసలు' అడుగుతూ చేయి సాచాడు నాన్న.

భయంతో బిక్కచచ్చిపోయాడు రాముడు. వాడి కళ్ళముందు ఇదివరకటి నాన్న కోపం దృశ్యాలన్నీ గిరగిరా, త్వరత్వరగా తిరగసాగినై.

"ఏరా?" మళ్ళీ అడిగాడు నాన్న.

రాముడు ఆలోచన తెగింది. పై ప్రాణాలు పైనే పోయినై. మనిషి మాత్రం నిలువునా కుంచించుకుపోయాడు. నెత్తిమీద నీళ్లకుండకు చిల్లుపడింది. నీరు మాత్రం కళ్ళల్లోంచీ ధారాపాతమైంది.

అతి కష్టంమీద ముక్కలు ముక్కలుగా జరిగిన విషయాన్ని మాటల్లో రాల్చాడు.

నాన్న తనను తాను తమాయించుకోలేకపోయాడు. అమ్మనీ రాముణ్ణీ కలిపి బూతుల్లోకి ఎక్కించాడు. 'ఛీ...పనికిరాని ముండాకొడకా. లాభం సంగతి దేవుడెరుగు. అసలుకే మోసం తెస్తివిరా. సరుకు పోయింది. ఉరుము గల్లంతైంది. నిన్నసలు కోసి

ఉప్పు పాతరెయ్యాలి లమ్డీ కొడకా' అంటూ చెయ్యెత్తి బలంగా వీపుమీద కొట్టాడు. సాచి చెంపలు పగలకొట్టాడు. అందిన చోటల్లా పిడిగుద్దులు గుద్దాడు.

నాన్న చివరి దెబ్బకి రాముడుపోయి, మనుషుల్ని తోసుకుంటూ, రాసుకుంటూ, కొట్టుకుంటూ పోయి పోయి ధమ్మని షాపు గోడకు కొట్టుకుని కుప్పకూలిపోయాడు.

'చావరా లంజకొడకా...' అంటూ నాన్న విసురుగా వెళ్ళిపోయాడు.

రాముడికి కళ్ళు బైర్లు కమ్మినై. స్పృహలేని వాడిలా కూలిపోయాడు. వెఉక్కులు నిమ్మళంగా ఆగినై.

"ప్చ్.... పాపం" అన్నారు శ్రోతలు. "తర్వాతేమయింది" అడిగారు.

"వినండి"

రాముడు తెప్పరిల్లుకుని లేచేసరికి రాత్రి చాలా పొద్దుపోయింది. మొహమంతా చొక్కాతో తుడుచుకున్నాడు. వొళ్ళు నొప్పులు పుడుతున్నై.

నాన్న రాలేదు. నాన్న రాడు.

అమ్మకూడా రాలేదు.

ఏడుపొచ్చింది. వాళ్లకి నేనక్ఖర్లేదు. ఎక్కడ చచ్చినా, ఏమైపోయినా అఖ్ఖర్లేదు. రోషం, కోపం రేగినై.

లేచి నడక మొదలెట్టాడు. చుట్టూ ఎటు చూసినా కోలాహలం. లైట్ల వెలుగు, పక్కన చలి వేంద్రంలో నీళ్ళు తాగాడు. ఎవరో పందిట్లో పప్పు బెల్లాలు పెడుతున్నారు. పెట్టించుకుని తిన్నాడు. మళ్లీ నీళ్లు తాగాడు.

మార్కెట్ దాకా నడిచాడు.

హరికథ సాగుతోంది. నిలబడ్డాడు. హఠాత్తుగా పక్కమనిషిని చూశాడు.

వాడు – చంద్రం. తన స్నేహితుడు పిలిచాడు. పక్కకుపోయారు. పెద్దవంతెన గట్టు మీద కూర్చున్నారు. తన కథంతా చెప్పాడు రాముడు. మిత్రుడి సానుభూతి బాగానే లభించింది. ఇంటికి పోదాం పదమన్నాడు. రానే రానన్నాడు రాముడు. చచ్చినా ఆ గడప తొక్కనన్నాడు. నాన్న కోపం, దుర్మార్గం గురించి చెప్పాడు. ఇదివరలో

నాన్న తననెలా హింసించిందీ చెప్పుకున్నాడు. జంపని కాలవలో ఈతల కెళ్ళినప్పుడు, నాలుగు రోజులు గదిలో పడేసి కొట్టిన సంగతీ చెప్పాడు.

మట్లాడి మాట్లాడి వెళ్ళిపోబోయాడు చంద్రం. ఎక్కడికి పోతావంటే రాముడు చెప్పలేదు. ఏ బెజవాడో పోతే పోతానని యధాలాపంగా అన్నాడు. చంద్రం తన ఇంటికి వెళ్ళిపోయాడు.

రాముడు దొంగలబండిలో గుంటూరు పోవటానికి కూచున్నాడు.

❖ ❖ ❖

మర్నాడు పొద్దున -

చంద్రం రాముడు వాళ్లింటికి వెళ్ళి జరిగిందంతా చెప్పాడు.

"అయ్యో అయ్యో పిచ్చి నాగన్న. ఇంత పనిచేశాడా' అని వాళ్లమ్మఏడ్చి మొత్తుకుంది. మొగుణ్ణి సతాయించింది. - పోయి రాముణ్ణి వెతుక్కురమ్మని. నాన్న కస్సుమన్నాడు. తిట్టాడు. కాదు పొమ్మని మూర్ఛించాడు. వాడు వున్నా ఒకటే పోయినా ఒకటే. నాలుగు రోజులు కడుపు మాడితే వాడే కుక్కలా తిరిగొస్తాడు' అని భీష్మించుక్కూచున్నాడు.

రాముడు రాలేదు.

చాలా రోజులూ, నెలలూ గడిచినై. రాముడి ఆచూకీ లేదు. సంవత్సరాలూ జారినై. రాముడు వాళ్ళమ్మ జ్ఞాపకాల్లో మిగిలేడు.

చంద్రంకి చాలాకాలం బాధగా ఉండేది. నెమ్మదిగా ఈ సంగతులన్నీ పాతబడినై.

చంద్రం డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఏదో గవర్నమెంటాఫీసులో ఉద్యోగంలో చేరాడు.

"మరి రాముడి సంగతేమిటి?" శ్రోతల్లో ఉత్సుకత పెరిగిపోతోంది.

చంద్రం పెళ్ళికూడా చేసుకున్నాడు. ముగ్గురు పిల్లలు. సంసారం సాగరం దుఃఖం అన్నట్టు... వానపాముజీవితం గడిచిపోతోందతనికి. చంద్రం మధ్య తరగతి మనిషిగా స్థిరపడిపోయాడు.

"అది సరే. రాముడేమయ్యాడు?" నలుగురు శ్రోతలూ ఒకేసారి అడిగారు. ఉత్కంఠ నిలవనీయటం లేదు వాళ్ళని.

ఆ విషయానికే వస్తున్నా.. .. రాముడు.. ఇప్పుడు మన రాష్ట్రంలోని ముఖ్యమైన ఎమ్మెల్యేలలో ఒకడు! పేరు రామకృష్ణ.

'ఆఁ! అరె! అంటూ నోళ్ళు వెళ్లబెట్టారు శ్రోతలు.

అంతా శ్రీరామనవమి మహాత్యం. విసనకర్రల జ్ఞానం. ఆనాడు తన చేతిలోంచి బలవంతంగా విసనకర్రల కట్టని లాక్కుపోయిన వాడి తెలివీ, ధైర్యమూ - చాలా పాఠాలు నేర్పినై రాముడికి. అదే వాడి గెలుపు రహస్యం!

'ఓటమిలోంచీ గెలుపు సాధించటమే రాజకీయం'

'ఇసకలోనుంచీ తైలం తీయటం కాలాంతకప్పని'

శ్రోతల్లో స్పందన. 'నీ కోసం నా బాగుకు అన్నట్లుంది' ఎవరో అడిగారు 'అయితే చంద్రంకీ సంగతులు తెలుసా?'

ముసి ముసిగా నవ్వి ఊరుకున్నారు తాతగారు!!

శ్రోతలకీ అర్థమైనట్టుంది!!!

–చినుకు మాసపత్రిక, మార్చి 2011